క్లుప్తంగా

గోసాలలో అమ్మవారికి గాజుల అలంకరణ



పెనమలూరు: గోసాల గ్రామం వైకుంఠపురంలో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గ మల్లేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శాకంబరీ అలంకరణ చేసిన అనంతరం శనివారం ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని గాజులతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా ఆదివారం అమ్మవారిని గ్రామస్తులతో సాగస్వీకారం చేస్తారని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

గుర్రపు డెక్కతో కాలువలో కదలని నీరు



పెనమలూరు: గోసాల వైకుంఠపురం వంతెన వద్ద బందరు కాలువలో సాగు నీటి పారుదలకు తీవ్ర సమస్య తలెత్తింది. బందరు కాలువలో గుర్రపుడెక్క ఎగువ ప్రాంతం నుంచి కాలువలో కొట్టుకువచ్చి వైకుంఠపురం వంతెన వద్ద పెద్ద ఎత్తున నిలిచిపోయింది. దాదాపు 100 మీటర్ల మేర గుర్రపు డెక్క కాలువలో ఉండిపోవడంతో సాగు నీటికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సాగునీటి కాలువల్లో ఉన్న గర్రపు డెక్కను ప్రభుత్వం తొలగించలేదు. దీంతో పెద్ద సమస్యగా మారిందని రైతులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి కాలువపై ఉన్న వంతెనల వద్ద గుర్రపు డెక్కను తొలగించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న శాకంబరీ ఉత్సవాలు



ఉయ్యూరు: శాకంబరీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. భక్తులు భక్తిప్రపత్తులతో శాకంబరీ రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకుని విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. దుర్గాదేవి శరణు..శరణు..అంటూ భక్తిపారవశ్యం చెందారు. ఉయ్యూరులోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో శనివారం అమ్మవారు ఆకుకూరలు, కూరగాయలతో శాకంబరీగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. ఉయ్యూరు శివాలయం, పెద ఓగిరాల శివాలయంలో ఉత్సవాల సందర్భంగా భక్తులు విశేష పూజలు చేశారు.

వంతెనకు పసుపు రంగు



కంకిపాడు: భవనాలు, శిలాఫలకాలే కాదు.. ఆఖరికి వంతెనలను కూడా వదలడం లేదు టీడీపీ శ్రేణులు. ఏకంగా వంతెన రెయిలింగ్‌లకు పసుపు రంగు పూసేశారు. మండలంలోని మంతెన గ్రామ పరిధి గుండా ప్రవహించే ముగుగు కాలువ వంతెన రెయిలింగ్‌కు ఇటీవల టీడీపీ శ్రేణులు పసుపు రంగు పులిమారు. ఈ చర్యపై స్థానికులు పెదవి విరుస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలంలో బోరు



ఉయ్యూరు: ఉయ్యూరు నడిబొడ్డున నిబంధనలకు నీళ్లొదిలారు. ప్రధాన సెంటరుకు ఆనుకుని ఉన్న ఓ భవన యజమాని బోరును ఆర్‌అండ్‌బీ పోరంబోకు స్థలంలో దర్జాగా బోరు వేశాడు. ఎక్కడైనా బోరు వేస్తాం.. ఆపేదెవడు అన్నట్లు వ్యవహరించాడు. పట్టపగలే జరుగుతున్న ఈ పనులను ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ అధికారులు వచ్చి చేతులు ముడుచుకుని పలాయనం చిత్తగించారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ మల్లికార్జున్‌ను వివరణ కోరగా బోరు వేసే స్థలం మున్సిపల్ అధికారులు చూడాలని, బోరు వేసే వ్యక్తికి ఆర్‌అండ్‌బీ నుంచి నోటీసు ఇస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. హనుమాన్‌జంక్షన్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక కేఎస్ టాకీస్ రోడ్డులో నివసిస్తున్న బండారు జ్యోతి (43) తన సమీప బంధువుల వద్ద అప్పు తీసుకుంది. ఆ నగదు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన జ్యోతి ఈనెల 10వ తేదీన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చిన్నవుటపల్లి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది.

రైతన్నను ముంచిన వర్షం



బుద్ధవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ తేజశ్విని



పోరంకిలో నీట మునిగిన పంట పొలాలు

- నీట మునిగిన పంట పొలాలు
- పరిశీలించిన వ్యవసాయ అధికారులు

పెనమలూరు: మండల పరిధిలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పల్లపు ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. రైతులు గత కొద్ది రోజుల క్రితమే నాట్లు వేయగా పంట పొలాలు నీటిలో మునగడంతో ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో సార్వ వరి సాగు 2,511 హెక్టార్లలో సాగు చేయడానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. కాగా వెయ్యి హెక్టార్లలో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. నాట్లు పడిన తర్వాత ముందుగా అడపాదడపా పడిన వర్షంతో రైతులకు మేలు జరిగింది. అయితే తుపాను కారణంగా గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో పంట పొలాల్లో విపరీతంగా నీరు చేరుకుంది. నాట్లు వేసిన పంట నీట మునిగింది. పరిస్థితులు ఇలాగే ఉంటే నాటిన వరి నాట్లు దెబ్బతినే ప్రమాదం ఉంది.

పొలాల వద్ద డ్రెయిన్ల సమస్య..

డ్రెయిన్ల సమస్యతోనే చినుకు పడితే పంట పొలాలు నీట మునుగుతున్నాయి. డ్రెయినేజీల పూడిక తీత పనులు చేయకపోవడంతో రైతులకు శాపంగా మారింది. డ్రయిన్లలో గుర్రపు డెక్క, ఇతర పిచ్చి మొక్కలు పెద్ద ఎత్తున ఉండటంతో డ్రెయినేజీల్లో నీరు ముందుకు సాగడం లేదు. పోరంకి, వణుకూరు, పెదపులిపాక ప్రాంతాల్లో డ్రెయినేజీల పూడిక తీత తీయకపోవడంతో ఆయా గ్రామాల పరిధిలో దాదాపు 500 ఎకరాల పంట పూర్తిగా నీటిలో మునిగింది. వర్షాలు తగ్గి పొలాల్లో నీరు బయటకు వెళితేనే పంట నష్టం జరగకుండా ఉంటుంది. నీరు పొలాల నుంచి బయటకు వెళ్లకపోతే నాటిన నాట్లు మురిగిపోయే ప్రమాదం ఉంది.



పెదపులిపాకలో పంట పొలాలు పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

అధికారుల పరిశీలన..

కాగా మండల పరిధిలో పంట పొలాలు నీట మునగడంతో డీఆర్‌సీ టీమ్ ఏడీఏ శ్రీనివాస్, ఏఓ పద్మజ, మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ పోరంకి, తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో పర్యటించారు. పంట పొలాల్లో ఉన్న నీటిని మోటార్ల ద్వారా తోడాలని సూచించారు. వర్షం తగ్గితే వరి పొలాల్లో ఎకరాకు 10 కేజీల యూరియా, 5 కేజీల పొటాష్ వేయాలని సూచించారు. తుపాను తగ్గే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

బుద్ధవరంలో పొలాల పరిశీలన

గన్నవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని బుద్ధవరంలో నీట మునిగిన వరి నారుమళ్లు, విత్తనాలు వెదజల్లిన పొలాలను శనివారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఎస్ఎల్. తేజశ్విని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. అధికంగా ఉన్న వర్షం నీటిని పొలాల్లో రెండు మీటర్లకు ఒక కాలిబాట తీసి నీరు బయటకు తరలించాలని సూచించారు. సుమారు 14 రోజులు పైబడిన నారుమళ్లు మాత్రమే ఎక్కువ నీటి మట్టాన్ని తట్టుకుంటాయని చెప్పారు. తెగుళ్లు సోకకుండా ముందస్తుగా ఒక లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండిజం కలిపి పిచికారి చేయాలని సూచించారు. నాట్లు వేసిన వరి పొలాల్లో బూస్టర్ డోస్‌గా 20 కేజీల యూరియా, 15 కేజీల మోప్ జల్లుకోవాలని చెప్పారు. పలువురు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



మంతెన, జగన్నాథపురంలో నీట మునిగిన వరి పొలాలు

కంకిపాడు: మండలంలోని మంతెన-జగన్నాథపురం డొంక ప్రాంతాల్లో సుమారు 80 ఎకరాల్లో వరి నాటిన పొలాలు ముంపునకు గురయ్యాయి. వరి నాట్లు, వెద పట్టిన పొలాల గుండా వర్షం నీరు ప్రవహిస్తోంది. వన్నేరు డ్రెయిన్ వ్యర్థాలతో నిండిపోవడంతో పొలాల్లో మురుగు డ్రెయిన్‌లోకి మళ్లడం లేదు. యుద్ధప్రాతిపదికన వన్నేరు డ్రెయిన్ వ్యర్థాలు తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారి పిఎం. కిరణ్, సిబ్బందితో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

రైతుబజారులో బియ్యం, కందిపప్పు విక్రయాలు

కంకిపాడు: పెరుగుతున్న ధరల నియంత్రణ చర్యల్లో భాగంగా కంకిపాడు రైతుబజారులో బియ్యం, కందిపప్పు విక్రయాలు చేపట్టామని తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకుగానూ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల సంస్థ ఆదేశాలతో ఇటీవలే కంకిపాడు రైతుబజారులో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయించామన్నారు. దేశవాళీ కందిపప్పు కిలో రూ. 160, స్టీమ్ రైస్ కిలో రూ. 49కి, ఆర్‌ఎడబ్ల్యూ రైస్ కిలో రూ. 48కి అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు.

గన్నవరం: స్థానిక రైతుబజార్‌లో రాయితీపై సరఫరా చేస్తున్న కందిపప్పు, బియ్యాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ప్రత్యేక కౌంటర్ ద్వారా 23.83 క్వింటాల్ బియ్యం, 411 కేజీల కందిపప్పు విక్రయాలు జరిపినట్లు చెప్పారు. తహసీల్దారు, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దారు పర్యవేక్షణలో విక్రయాలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఉయ్యూరు: రైతుబజారులో బియ్యం, కందిపప్పు సబ్సిడీపై అందిస్తున్నట్లు తహసీల్దార్ గురుమూర్తి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: నిత్యావసర సరుకులను ప్రజలకు అందుబాటు ధరల్లో ఉంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తక్కువ రేట్లకే కందిపప్పు, బియ్యం విక్రయిస్తున్నట్లు బాపులపాడు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఉషోదయ సూపర్ మార్కెట్, వెంకట సత్యనారాయణ జనరల్ స్టోర్స్ ద్వారా తక్కువ రేట్లకు అందిస్తున్న కందిపప్పు, బియ్యం విక్రయాలను శనివారం తహసీల్దార్ శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ డెప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీఎస్ ప్రధాన్‌లు తనిఖీ చేశారు. దేశవాళీ కందిపప్పు కేజీ రూ. 160, స్టిమ్డ్ బియ్యం కేజీ రూ. 49, రా రైస్ కేజీ రూ. 48 చొప్పున విక్రయిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఆయా దుకాణాలకు 23.83 క్వింటాల బియ్యం, కందిపప్పు 411 కేజీలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.



హనుమాన్‌జంక్షన్ ఉషోదయ సూపర్ మార్కెట్‌లో అమ్మకాలు పరిశీలిస్తున్న అధికారులు

కౌలురైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి



కంకిపాడు: సాగుదారులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ కౌలురైతు, వ్యవసాయ కార్మిక, రైతుసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కంకిపాడు తహసీల్దార్ ఎం.రామకృష్ణకు వినతిపత్రం అందించారు. రంగారావు మాట్లాడుతూ గుర్తింపు కార్డులు ఇచ్చిన ప్రతీ ఒక్కరికి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని రోజు కూలీ రూ. 600 ఇవ్వాలని విజ్ఞప్తిచేశారు. ఉమ్మడి కార్యాచరణలో భాగంగా కంకిపాడు, బొడ్డపాడు, గొడవర్రు, తెన్నేరు గ్రామాల్లో సంతకాల సేకరణ పూర్తి చేసి సచివాలయ కార్యదర్శులకు వినతులు అందించామన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు వి.శివశంకర్, జె.రవి, వి.మరియదాసు, టి.నరేష్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



రాజుల బజారు చివర ప్రధాన రోడ్డుపై వర్షపునీరు



ఇస్లాంపేటలో రోడ్డుపై నిలిచిన నీరు



తేలప్రోలులో పర్యటిస్తున్న తహసీల్దార్ సుబ్బారావు



కోడూరుపాడు రైల్వే అండర్‌పాస్‌లో వర్షపు నీళ్లు

గన్నవరం: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గన్నవరం ప్రాంతంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీలో పలు గృహాలు, అంతర్గత రహదారులు ముంపుబారిన పడ్డాయి. స్థానిక ఇస్లాంపేటలో డ్రెయిన్లు పూడుకుపోవడంతో వర్షం నీరు రోడ్లపైకి చేరింది. దీనికితోడు డ్రెయిన్లలో మురుగునీటి పారుదల లేకపోవడంతో దోమల బెడద కూడా ఎక్కువైందని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్, రమణమ్మచెరువు కాలనీల్లో లోతట్టులో ఉన్న ఇళ్లు కూడా ముంపునకు గురయ్యాయి.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పలు అంతర్గత రోడ్లు నీట మునిగాయి. ఎడతేరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గ్రామంలోని రాజుల బజారు చివర, కొట్టివారి వీధి, అంకిత అపార్టుమెంట్ ఏరియా, కాల్వగట్టు ప్రాంతాల్లో పలు రోడ్లు వర్షపునీటితో నిండిపోయాయి. ముఖ్యంగా డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు పారుదల లేక రోడ్లపైకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూడుకుపోయిన డ్రెయిన్లను పూడిక తీయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్‌పాస్ పూర్తిగా జలమయమైంది. దీంతో గ్రామస్తుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. రైల్వే అండర్‌పాస్‌లో నిల్చిన వర్షపు నీళ్ల తొలగించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని

ఉంగుటూరు: తుఫాన్ కారణంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని తహసీల్దార్ సుబ్బారావు సూచించారు. మండలంలోని తేలప్రోలు గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. తేలప్రోలు ముందడుగు కాలనీ, ఎన్టీఆర్ కాలనీల్లోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీళ్లు ఉండటాన్ని గుర్తించారు. వర్షంనీరు సజావుగా ముందుకు సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి కృపాకుమార్‌కు సూచించారు. సర్పంచ్ లాం దిబోర, వీఆర్‌వో అట్లూరి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ గోదామును అందుబాటులోకి తీసుకురావాలి

నున్న(విజయవాడరూరల్): నున్న కోపరేటివ్ సొసైటీ ద్వారా నిర్మిస్తున్న మల్టీపర్పస్ గోదాం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సొసైటీ ప్రత్యేక అధికారి వి.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో శనివారం మహాజనసభ జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ మాజీ ఛైర్మన్ పోలారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి గోదాం త్వరగా నిర్మించి రైతులకు వినియోగంలోకి తీసుకురావాలని వినతి పత్రం అందజేశారు. గోదాం అద్దెకు ఇచ్చే విషయంపై అధికారులతో రైతులు చర్చించారు. గోదాం నిర్మాణానికి తీసుకున్న రుణంపై తిరిగి చెల్లింపులు చేయాలి కాబట్టి అద్దెకు ఇవ్వాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. వ్యక్తిగత రుణాలు రూ. 6 కోట్లు ఇవ్వగా రూ. 3 కోట్లు తిరిగి వసూలు చేయడం జరిగిందని సీఈఓ రమేష్ తెలిపారు. రైతులకు ఇచ్చే వ్యవసాయ రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కలకోటి శ్రీనివాసరెడ్డి, యర్కారెడ్డి కోటిరెడ్డి, బాలశేఖర్‌రెడ్డి, గుంటక చినవెంకటరెడ్డి, ఢిల్లీ వెంకటేశ్వరావు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో ఆర్బీహెచ్ కాలనీ, శాలివాహన కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మరో ఇద్దరికి రిమాండ్

గన్నవరం: ఏడాదిన్నర కిందట కృష్ణాజిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి ఘటనకు సంబంధించిన కేసులో పోలీసులు శనివారం మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొదట 44 మందిని నిందితులుగా చేర్చారు. ఇటీవల టీడీపీ ప్రభుత్వం వచ్చాక తిరిగి ఈ కేసును తెర మీదకు తెచ్చారు. టీడీపీ నేతల ఒత్తిడి మేరకు పోలీసులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ సహా మరో 27 మందిని నిందితుల జాబితాలో చేర్చారు. వారిలో ఇప్పటికే 15 మందిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం నూజివీడు సబ్‌జైలుకు తరలించారు. తాజాగా వైఎస్సార్‌సీపీ నాయకులు బొమ్మారెడ్డి వెంకట నరసింహారెడ్డి, కారుమంచి మహేష్‌లను అరెస్ట్ చేశారు. వారిని శనివారం స్థానిక 12వ ఏఎంఎం కోర్టులో హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో స్థానిక సబ్ జైలుకు తరలించినట్లు సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్ చెప్పారు.

ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు

కలెక్టర్ బాలాజీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత శనివారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి భారీ వర్షాలు, వరదలు పట్ల తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొని జిల్లాలోని పరిస్థితులను మంత్రికి వివరించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అధిక వర్షాలకు ఘంటసాల మండలం పాప వినాశనం గ్రామంలో మొవ్వ కోటేశ్వరికి చెందిన పక్కా గృహం గోడలు బలహీనంగా ఉండటం వల్ల గోడలు కూలాయని, ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ బాలాజీ, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ దుర్గా కిషోర్ పాల్గొన్నారు.

నేడు పోరంకిలో గురుపౌర్ణమి



గురువులను సన్మానించిన యోగా అభ్యాసకులు

పెనమలూరు: పోరంకి శ్రీనివాసానగర్‌లో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో నేడు గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు మందిర అధ్యక్షుడు మున్నంగి అర్జున్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన వివరాలు తెలుపుతూ సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

పెదపులిపాకలో..

పెదపులిపాక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవిజయ రాజరాజేశ్వరి, శ్రీవిజయ సుందరేశ్వర స్వామివారి దేవస్థానంలో గురుపౌర్ణమి సందర్భంగా శ్రీవాసుదేవానందగిరి స్వామీజీ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

పోరంకిలో గురుపూజ మహోత్సవం

పెనమలూరు: పోరంకిలో శనివారం గురుపూజ మహోత్సవం ఘనంగా చేశారు. శ్రీ వెంకటేశ్వర యోగా కేంద్రం ప్రధాన యోగాచార్యులు శ్రీవెంకటేశ్వర యోగా గురూజీ, ఉప ప్రధాన యోగాచార్యులు మండ్రు శ్రీనివాసరావు గురూజీలను సన్మానించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, వేదవ్యాస భగవానుడి పూజ చేశారు. అనంతరం యోగా గురువులను పూలు, శాలువతో సత్కరించి పూజలు చేశారు. కార్యక్రమంలో తులసీకృష్ణ, వెంకటకృష్ణ, కె.మురళీకృష్ణ, మురళీకృష్ణ ప్రసాద్, మాదల లక్ష్మి, కనకదుర్గ, దుర్గాప్రసాద్, జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధికారులు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసన్న కుమారి, వేదికపై వైస్ ఎంపీపీ సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు

విజయవాడరూరల్: మండలంలో జరిగే అభివృద్ధి పనులకు అధికారులు సమన్వయంతో పనిచేసి సహకరించాలని ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. ఎంపీపీ అధ్యక్షతన శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు చేస్తున్న ప్రతిపాదనలకు అనుకూలంగా అధికారులు వ్యవహరించి గతంలో మాదిరిగానే అభివృద్ధి పనులు జరిగే విధంగా పనిచేయాలని అన్నారు. తహసీల్దారు పి.జాహ్నవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజూ గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ భూముల ఆక్రమణల గురించి అధికారులకు తెలియజేస్తే వాటిని తొలగిస్తామని చెప్పారు. పాతపాడు, అంబాపురం గ్రామాల్లో పైపులైను లీకేజీ బాగా జరుగుతోందని గ్రామ సర్పంచి గండికోట సీతయ్య తెలిపారు. ఎనికేపాడు గ్రామంలో నాడు-నేడు కింద నిర్మించిన భవనం పనులు చివరిదశలో ఆగిపోయాయని, మిగిలిన పనులు చేపట్టాలని సర్పంచి పూర్ణచంద్రరావు కోరారు. ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న తనను నున్న గ్రామ సర్పంచి భర్త కాటూరి శ్రీనివాసరావు హేళనగా మాట్లాడి, మండలం నుంచి నిధులు తెచ్చుకొని పనులు చేసుకోవాలని అన్నారని ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ సమావేశాల్లో ఎంపీటీసీ సభ్యులకు తగిన గౌరవం ఇవ్వాలని ఎంపీపీ ప్రసన్న కుమారి సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, కోఆప్షన్ అల్తాఫ్, ఎంపీటీసీ సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి



అవగాహన ర్యాలీలో న్యాయమూర్తి కె.శ్రీహరి

ఉయ్యూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా వినియోగించాలని ఉయ్యూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.శ్రీహరి సూచించారు. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణం నుంచి ప్రధాన సెంటరు వరకూ ర్యాలీ చేస్తూ హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. న్యాయమూర్తి శ్రీహరి మాట్లాడుతూ హెల్మెట్ ధారణ విధిగా తీసుకుని ప్రాణాలను రక్షించుకోవాలన్నారు. వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణకు ఉపకరిస్తుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాగిత గోపిచంద్, ఉపాధ్యక్షుడు పల్లి అశోక్, ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్, ఎస్ఐలు గణేష్‌కుమార్, అవినాష్, శ్రీనివాస్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.